క్లుప్తంగా

సత్తాచాటిన కావూరు హైస్కూల్ విద్యార్థిని



చిలకలూరిపేటటౌన్: జాతీయస్థాయి షూటింగ్ బాల్ (బాలికల) పోటీల్లో కావూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని గుంజి సామ్రాజ్యం ప్రతిభను చాటింది. ఈనెల 8,9,10వ తేదీల్లో అనంతపురం జిల్లా నార్పాలలో జరిగిన 43వ జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో రాష్ట్రజట్టులో కావూరు హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న సామ్రాజ్యం పాల్గొని అత్యుత్తమ ప్రతిభను కనపరిచి జట్టు గెలుపునకు కృషి చేసింది. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం ఎస్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు క్రీడాకారిణి సామ్రాజ్యంతోపాటు పీడీ తిరుమల బాబును అభినందించారు. కార్యక్రమంలో గుంటూరు ఆడిటర్ డీఎస్ఆర్, లింగంగుంట్ల వాసి నజీర్ బాలికకు ఆర్థికసాయం అందించారు.

పశుగణన సర్వేలో భాగస్వామ్యం తప్పనిసరి



శావల్యాపురం: 21వ పశుగణన సర్వే కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని మండల పశువైద్యాధికారి సోముల గుణధీర్ అన్నారు. మంగళవారం స్థానిక పశువైద్యశాల్లో పశువైద్యాధికారి మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామపంచాయతీలో పశుగణన సర్వే చేయటానికి 06 మంది ఎన్యూమరేటర్స్ పనిచేస్తుండగా 10,700 నివాస గృహాలు ఉండగా ఇప్పటి వరకు 4321 గృహాలను సర్వే చేసినట్లు తెలిపారు. పశుగణనలో భాగంగా అన్ని రకాల పశువుల వయస్సు లింగం, ఫోను నంబరు, తదితర సమగ్ర వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అలాగే పశువులకు చెవిపోగులు లేని వాటిని గుర్తించి చెవిపోగులు సిబ్బంది వేస్తున్నారన్నారు. పాడి రైతులందరూ పశుసంవర్ధక శాఖ సిబ్బందికి సహకరించాలన్నారు.

చేతిరాతపై విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం



శావల్యాపురం: చేతిరాత పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు దోహదపడుతుందని చేతిరాత ప్రవీణ సోమేపల్లి సీతారామయ్య అన్నారు. మంగళవారం స్థానిక శ్రీరామా పబ్లిక్ స్కూల్లో విద్యార్థులకు చేతిరాతపై ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సోమేపల్లి సీతారామయ్య మాట్లాడుతూ ఆత్మవిశ్వాసానికి ప్రతీక మెలుకువలు పాటిస్తే రాత అందంగా రాయవచ్చన్నారు. ఆకర్షించేలా చేతిరాత ఎలా రాయాలో విద్యార్థులకు శిక్షణ అందించారు. అనంతరం పాఠశాల యాజమాన్యం సీతారామయ్యను ఘనంగా సత్కరించారు. పాఠశాల కరస్పాండెంట్ కె.వి.ఆర్.మోహన్‌చందు, ప్రిన్సిపాల్ రత్నకుమారి, డైరెక్టరు అజిత్‌చందు, ఉపాధ్యాయులు కె.మేఘన బృందం పాల్గొన్నారు.

పదిలో నూరుశాతం ఫలితాలు సాధించాలి



నరసరావుపేట రూరల్: పదిలో నూరుశాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ తెలిపారు. మండలంలోని జొన్నలగడ్డ జెడ్పీ హైస్కూల్‌ను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మెటివ్ అసెస్మెంట్-1 పరీక్షను పరిశీలించారు. అనంతరం 6 నుంచి 10వ తరగతి విద్యార్థులను ప్రశ్నలు అడిగి అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. తరువాత సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. నెమ్మదిగా నేర్చుకునే విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.మల్లిఖార్జునరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది కార్యక్రమం

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి,శావల్యాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారులు మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు వ్యవసాయ సిబ్బంది రైతులు కంది పంట పొలాన్ని పరిశీలించి పూత దశలో ఉందని పురుగు వ్యాప్తి అధికంగా ఉంటే ఇండాక్సాకార్బ్ 200 యంఎల్ పిచికారి చేయాలన్నారు. ఆయనతో పాటు ఏఈవో పురేటి అశోక, వీఏఏ స్రవంతి, వెంకాయమ్మ,రైతులు పాల్గొన్నారు.

మిరప పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

బొల్లాపల్లి : ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఘాటి తండాను మంగళవారం సైంటిస్టులు, అధికారులు సందర్శించి మిరప పొలాలను పరిశీలించారు. దర్శి ఉద్యాన పరిశోధన కేంద్రం సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ ఎం. రవీంద్రబాబు, వినుకొండ ఉద్యాన శాఖ అధికారి షేక్ నబి రసూల్‌లు రైతులకు సూచనలు, సలహాలు అందజేశారు.

విద్యుత్ ఉప కేంద్రం వెలుగులీనేనా?

- నిరీక్షిస్తున్న మండల వాసులు
- రూ. 4 కోట్ల వ్యయంతో నిర్మాణం
- 5 వేల నివాస గృహాలకు ఉపయుక్తం
- కాంట్రాక్టరు నిర్లక్ష్యమే శాపం!



వేల్పూరు గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్ స్టేషను

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామ సమీపాన రూ.4 కోట్ల వ్యయంతో 33/11 కేవీ సామర్థ్యం కలిగిన విద్యుత్ సబ్ స్టేషను పనులు పూర్తిస్థాయి కాకపోవటంతో విద్యుత్ వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎకరం స్థలంలో నూతనంగా ఆరంభించిన ఈ నిర్మాణ పనులు కేవలం కాంట్రాక్టరు నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి నెలల గడుస్తున్నా ఇంత వరకు ఈ పనులపె శ్రద్ధ చూపెట్టకపోవడం గమనార్హం. నిర్మాణ పనులపై అధికారులు ఎందుకు కినుక వహిస్తున్నారన్నది ఎవరికీ అర్థం కాకుండా ఉన్నది.

పూర్తయితే ఎంతో ఉపయుక్తం

విద్యుత్ సబ్‌స్టేషను పరిధిలో వేల్పూరు గ్రామంలో విద్యుత్ మీటర్ల-2 వేలు వెలమవారిపాలెం-200, గంటావారిపాలెం-460, పోట్లూరు-1100, బొగ్గరం-900 విద్యుత్ మీటర్లు ఉన్నాయి. నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు నూరుశాతం అయితే అనధికార విద్యుత్ కోతలు నియంత్రణకు పాటు విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందుబాటులోకి రానున్నాయి. దీనికితోడు మండలంలోని కారుమంచి, శావల్యాపురం గ్రామాల్లోని విద్యుత్ సబ్ స్టేషన్లు పరిధిలో అదనపు లోడు భారం తగ్గుతుంది. భవిష్యత్‌లో విద్యుత్ అంతరాలు వాటిల్లితే ప్రత్యామ్నాయంగా వేల్పూరు నూతన విద్యుత్ సబ్‌స్టేషను పరిధిలో నుంచి మిగిలిన గ్రామాల్లోకి విద్యుత్ సరఫరా ఇచ్చేలా క్షేత్ర స్థాయిలో విద్యుత్ అధికారులు పర్యవేక్షణ చేశారు. ఒక్కో సబ్‌స్టేషను పరిధిలో 5 వేల నివాస గృహాలకు అధికారికంగా విద్యుత్ సరఫరాతో పాటు 1500 వ్యవసాయ విద్యుత్ మోటర్లకు సరఫరా చేయు ఆధునిక సామర్థ్యం కలిగిన యంత్ర పరికరాలు వినియోగించారు. ఈ విషయం గురించి నరసరావుపేట విద్యుత్ డీఈ రాంబోట్లను వివరణ కోరగా విద్యుత్ కాంట్రాక్టరు పనితీరు వలన పనులు జాప్యమయ్యాయని, త్వరితగతిన పనులు పూర్తి చేస్తామన్నారు.

విద్యుత్ అధికారులు చొరవ చూపాలి



వేల్పూరులో నూతన విద్యుత్ సబ్‌స్టేషను పనులు నూరుశాతం పూర్తి అయ్యేలా అధికారులు చొరవ చూపాలి. విద్యుత్ కోతల నియంత్రణతో పాటు విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందుతాయి. త్వరితగతిన పనులు పూర్తిచేస్తే విద్యుత్ ఇబ్బందులు అధిగమించటానికి దోహదపడుతుంది.

–చెన్నా శివప్రసాదు, గంటావారిపాలెం

ప్రభుత్వం స్పందించాలి



వేల్పూరు గ్రామ పంచాయతీ పరిధిలో నూతన విద్యుత్ సబ్ స్టేషను ఏర్పాటు చేయటం మంచి శుభాపరిణామం. ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రత్యేకంగా దృష్టి సారించాలి. రానున్న రోజుల్లో పరీక్ష జరుగనున్నాయి. పనులు పూర్తయితే విద్యార్థులతోపాటు వినియోగదారులకు, రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

–ముండ్లమూరి సుహాసిని, ఎంపీపీ

ప్రశాంతంగా డీసీ ఎన్నికలు

- మండల డీసీల నుంచి రామిరెడ్డి, హనుమంతురావు ఎన్నిక
- ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ రేసులో రామిరెడ్డి



పులిమి రామిరెడ్డి



జాగరమూడి హనుమంతరావు

నరసరావుపేట రూరల్: మండలంలోని రెండు డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ)ల ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. లింగంగుంట్ల ఎన్ఎస్‌పీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఎన్నికల్లో డీసీ-19 అధ్యక్షుడిగా పులిమి రామిరెడ్డి (పాలపాడు), ఉపాధ్యక్షుడిగా బొడ్డపాటి శేషయ్య (ఇక్కుర్రు), డీసీ-20 అధ్యక్షుడిగా జాగర్లమూడి హనుమంత రావు (గురవాయపాలెం), ఉపాధ్యక్షుడిగా మాలేంపాటి నాగేశ్వరరావు (కమ్మవారిపాలెం)లు ఎన్నికయ్యారు. డీసీ-19 అధ్యక్షుడిగా ఎన్నికైన పులిమి రామిరెడ్డి ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్ష పదవి కోసం పోటీ పడుతున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో కలిసి మంగళవారం మంత్రి నారా లోకేష్‌ను కలిశారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పనిచేస్తున్న తనకు అవకాశం కల్పించాలని రామిరెడ్డి కోరారు. లోకేష్ నుంచి సానుకూలత లభించినట్టు తెలిసింది. సాగర్ ఆయుకట్టు పరిధిలోని ఎమ్మెల్యేల మద్దతు కూడగట్టే పనిలో ఆయన ఉన్నారు.

రొంపిచర్లలో ఘనంగా ఆరుద్రోత్సవం



ప్రత్యేక అలంకరణలో వల్లభేశ్వరస్వామి

రొంపిచర్ల: మండలంలోని శివాలయాల్లో ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని సోమవారం రాత్రి ఆరుద్రోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విప్పర్ల గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గంగా పార్వతీ సమేత వల్లభేశ్వర స్వామి ఆలయంలో అర్ధరాత్రి 12 గంటలకు 12 కిలోల కర్పూర జ్యోతి ప్రజ్వలన చేశారు. మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాల అనంతరం రుద్రాభిషేకం, రుద్రహోమం నిర్వహించారు.

మంగళవారం ఉదయం 5 గంటలకు మహా మంగళహారతి ఆశీర్వచనంతో కార్యక్రమాలు పూర్ణాహుతియ్యాయి. ఈ సందర్భంగా రాత్రి భక్తులు భజనా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

మహిళ కనబడటం లేదని ఫిర్యాదు



రొంపిచర్ల : మండలంలో పరగటిచర్ల గ్రామానికి చెందిన గుడిపూడి రామతులశమ్మ అనే మహిళ కనబడటం లేదని ఆమె కుటుంబ సభ్యులు మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్.ఐ అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పరగటిచర్ల గ్రామానికి చెందిన రామతులశమ్మ మతిస్థిమితం లేకుండా కొద్ది రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్ళిపోయారన్నారు. గ్రామంలో, పరిసర ప్రాంతాల్లో, సుదూర ప్రాంతాలలో ఎంత వెదికినా ఆమె జాడ తెలియలేదన్నారు. గుర్తించిన వారు 94406 96247, 9676133187 నంబర్లకు కాల్ చేయాలని ఎస్ఐ తెలిపారు.

హామీని నిలబెట్టుకోవాలి

నరసరావుపేట ఈస్ట్: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన నిరుపేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపు హామీని వెంటనే నెరవేర్చాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన దశల వారీ ఆందోళన కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఇళ్ల స్థలాలను కేటాయించాలని కోరుతూ బీసీ కాలనీ సచివాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి సత్యనారాయణరాజు, ఉప్పలపాటి రంగయ్య, దాసరి వరహాలు పాల్గొన్నారు.

పైరులో పురుగులు ఏరివేయండి

రొంపిచర్ల: మొక్కజొన్న పైరులో కత్తెర పురుగు ఎక్కువగా ఉందని డీఏ శివకుమారి అన్నారు. మండలంలోని వీరవట్నం, అన్నవరప్పాడు గ్రామాల్లో మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కత్తెర పురుగు మొవ్వులో ఎక్కువగా ఉందన్నారు. దీని నివారణకు డెలిగేట్, ఫేమ్, ప్రాక్‌లెన్ మందుగాని ఏదో ఒక మందు తీసుకుని పిచికారీ చేసి నివారించుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శివలలిత, ఏడీఏ పి.మస్తానమ్మ, ఆయా గ్రామాల వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

సకాలంలో డీబీటీ నమోదు చేయాలి

చిలకలూరిపేట: రైతులకు అవసరమైన ఎరువులను సకాలంలో అందించేందుకు ఎరువుల దుకాణదారులు సకాలంలో డీబీటీ నమోదు చేయాలని వ్యవసాయశాఖ ఏడీఏలు ఆర్.శశిధర్‌రెడ్డి, వై.శివశంకరరెడ్డి చెప్పారు. ఎరువుల దుకాణాల్లో డీబీటీ అమలు విధానం పరిశీలించేందుకు వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి మంగళవారం అధికారులు ఎరువుల దుకాణాలను తనిఖీ నిర్వహించారు. ఎరువులు విక్రయించిన వివరాలను ఎప్పటికప్పుడు డీబీటీలో నమోదు చేస్తేనే ఎరువుల సరఫరాలో ఎటువంటి అంతరాయం తలెత్తకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి టి.శ్రీలత పాల్గొన్నారు.

ఆవేశం.. భార్యను దూరం చేసింది

చిలకలూరిపేటటౌన్: వారిద్దరూ వృద్ధ దంపతులు. ఇద్దరి మధ్య కొద్దిపాటి వాగ్వాదం కాస్తా భార్య ప్రాణాలు పోయేందుకు కారణమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని వేలూరు గ్రామానికి చెందిన కందిమళ్ల సాంబయ్య, రజని దంపతులకు ఇద్దరు కుమారులు ఉండగా, వారిద్దరూ ఒకరు హైదరాబాద్, మరొకరు అస్సాం రాష్ట్రంలో ఉద్యోగాలు చేస్తున్నారు. అయితే సాంబయ్య, రజని వేలూరు ఉంటున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం వృద్ధులిద్దరి మధ్య రాజుకున్న చిన్నపాటి గొడవ కాస్తా వాగ్వాదానికి దారితీసింది. భర్త సాంబయ్య ఆవేశంతో కూరగాయల చాకుతో భార్య రజినిపై దాడి చేశాడు. ఇరుగుపొరుగు వారు అక్కడికి చేరుకుని ఇద్దరికీ సర్దిచెప్పారు. అనంతరం వాష్‌రూంలోకి వెళ్లిన రజిని (65) అక్కడి కుప్పకూలి మృతిచెందింది. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కుమారుడు సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భార్య మృతికి కారకుడైన భర్తకు జైలు

నరసరావుపేట టౌన్ : భార్య మృతికి కారణం అయిన భర్తకు నాలుగు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.1000 రూపాయలు జరిమానా విధిస్తూ అదనపు సహాయ సెషన్స్ న్యాయమూర్తి కె. మధుస్వామి మంగళవారం తీర్పు నిచ్చారు. చిలకలూరిపేట పట్టణానికి చెందిన దేశవత్ హనుమంతరావు నాయక్‌కు 18 సంవత్సరాల క్రితం రమణ బాయితో వివాహమైంది. హనుమంతరావు మద్యానికి బానిసై భార్య రమణ బాయ్‌ను 2020 సంవత్సరం నుంచి వేధిస్తుండటంతో విసిగి వేసారి 2021 నవంబర్ 30న ఎలుకల మందు సేవించి బలవన్మరణానికి పాల్పడింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న చిలకలూరిపేట పట్టణ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు అవడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

మహాసభలను విజయవంతం చేయండి

నరసరావుపేట: కాకినాడలో వచ్చే ఏడాది జనవరి 5, 6, 7, 8వ తేదీల్లో నిర్వహించే యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మోహనరావు, అధ్యక్షుడు ఓ.శ్రీనివాసరెడ్డి కోరారు. స్థానిక సంఘ జిల్లా కార్యాలయంలో మంగళవారం సభల ఆహ్వాన పత్రికలు విడుదల చేశారు. యూటీఎఫ్ పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ ఖాసిం పీరా, జిల్లా కార్యదర్శులు తిరుపతి స్వామి, టి.వెంకటేశ్వర్లు, ఐక్య ఉపాధ్యాయ పత్రిక బాధ్యులు రవిచంద్ర, ప్రాంతీయ శాఖల బాధ్యులు సత్యానందరావు, సీనియర్ నాయకులు కట్టా కోటేశ్వరరావు, వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు ఆచరణీయం

రొంపిచర్ల: క్రీస్తు బోధనలు ఆచరణీయోగ్యమని శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం రాత్రి టీడీపీ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సెమీక్రిస్మస్' వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. క్రీస్తు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. సెమీ క్రిస్మస్ కేక్ ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించుకోవాలి

చిలకలూరిపేట: పెన్షనర్లు ఐక్యతతో సమస్యలు పరిష్కరించుకోవాలని పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు నాగభూషణం, మాధవరెడ్డి చెప్పారు. పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో మంగళవారం పెన్షనర్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కందిమళ్ల మురళీధరరావు, కార్యదర్శి బిట్రా నాగేశ్వరరావు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ నాగిరెడ్డి, జి వెంకటేశ్వరరావు, బెల్లంకొండ వీరాంజనేయులు, కనుమూరి జాషువా, చుక్కా విన్సెంట్‌పాల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యను మెరుగు పర్చండి

ఎంపీడీవో పిడతల ఝాన్సీసాగర్

యడ్లపాడు: ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే వారంతా పేదకుంటుంబాలకు చెందిన వారేనని వారికి నాణ్యమైన విద్యను అందించడంపై అధికారులు దృష్టి సారించాలంటూ ఎంపీపీ పిడతల ఝాన్సీసాగర్ చెప్పారు. మండల ప్రజాపరిషత్ సాధారణ సమావేశం మంగళవారం జరిగింది. ఎంపీపీ పిడతల ఝాన్సీ సాగర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ముందుగా అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను తెలియజేశారు. యడ్లపాడు ఎంపీటీసీ కీర్తి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ అపార్ నమోదు నేపథ్యంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇందుకు మండలం పరిధిలో ఒక్క ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయకపోవడమే అని సభ దృష్టికి తెచ్చా సొలస ఎంపిటిసి శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ జెట్టి విజయశ్రీ, ఎంపీడీవోలు, గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల పెన్షనర్స్‌డే



గణపవరంలో పెన్షనర్లను సన్మానిస్తున్న తోటి పెన్షనర్లు



వినుకొండలో పెన్షనర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆంజనేయులు

నాదెండ్ల: గణపవరం పెన్షనర్స్ భవనంలో మంగళవారం జాతీయ పెన్షనర్ల దినోత్సవం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు తెలికేపల్లి హైమావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పెన్షనర్లు కుందుర్తి నాగేంద్రమ్మ, కనపర్తి విజయలక్ష్మీలను శాలువాలు, పూలమాలలతో సత్కరించి నూతన వస్త్రాలు బహూకరించారు. దివంగత రిటైర్డ్ ఉద్యోగి కాటా రామయ్య కుటుంబ సభ్యులు రూ.1 లక్ష, మాలెంపాటి వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు రూ.25 వేలు, యలవర్తి రాధాకృష్ణ కుటుంబ సభ్యులు రూ.25 వేలు, మాలెంపాటి ఆదిశేషమ్మ కుటుంబ సభ్యులు రూ.25 వేలను అసోసియేషన్‌కు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా సీనియర్ పెన్షనర్లు ఎస్.చంద్రశేఖరరావు, తూబాటి వెంకట సుబ్బయ్య, మాజీ అధ్యక్షుడు తొండెపు రాధాకృష్ణమూర్తిలు మాట్లాడుతూ పెన్షనర్లు ఏకతాటిపై ఉంటే సమస్యలను పరిష్కరించుకుని హక్కులను సాధించుకోవచ్చన్నారు. ప్రభుత్వం నుంచి రిటైర్డ్ ఉద్యోగులకు అందాల్సిన బెనిఫిట్స్, సమస్యల పరిష్కారానికి పోరాడతామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కాట్రు కృష్ణారావు, సభ్యులు కెల్లంపల్లి సింగయ్య, వడ్లమూడి చిన్నబ్బాయి, గాలి వెంకన్న పంతులు పాల్గొన్నారు.

వినుకొండలో...

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని విశ్రాంత ఉద్యగుల సేవా సంఘం భవనంలో ఆల్ ఇండియా పెన్షనర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ప్రభుత్వ చీఫ్‌విప్, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు పాల్గొని పెన్షనర్ల ఆరాధ్యుడు డీఎస్ నకరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 75 సంవత్సరాలు నిండిన పెన్షనర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఉప ఖజానాధికారి ఎండీ అజీముల్లా, కె. కృష్ణమూర్తి, జి. కృష్ణారెడ్డి, రాఘవయ్య, భువనగిరి సుబ్రహ్మణ్యం, గురవయ్య, ఎంవీ సుబ్బయ్య శర్మ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోండి



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ పి.అరుణ్‌బాబు

నరసరావుపేట రూరల్: రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. మండలంలోని పెదరెడ్డిపాలెంలో మంగళవారం నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సును ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సంబంధిత సమస్యల తక్షణ పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈనెల 6వ తేదీ నుంచి పెద్ద ఎత్తున నిర్వహిస్తూ ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సౌకర్యాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారం, బోధన విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డీవో మధులత, తహసీల్దార్ వేణుగోపాలరావు పాల్గొన్నారు.

భూసమస్యల సత్వర పరిష్కారం

రొంపిచర్ల: భూసమస్యలను సత్వర పరిష్కరించటమే రెవెన్యూ సదస్సుల లక్ష్యమని తహసీల్దార్ బండి నిర్మల అన్నారు. మండలంలోని బుచ్చిబాపన్నపాలెం గ్రామంలో మంగళవారం నిర్వహించిన దాసరిపాలెం రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సదస్సులో ఐదుగురు రైతులు అర్జీలు అందజేశారు. తమ పొలాలను ఆన్‌లైన్ అడంగల్‌లో నమోదు చేయాలని నలుగురు రైతులు అర్జీలు అందించగా, తమ భూమి సర్వే నిర్వహించాలని మరో రైతు అర్జీ అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కోటేశ్వరరావు, మండల సర్వేయర్ రవికుమార్, రెవెన్యూ పరిధిలోని వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

బస్టాండ్ పరిసరాల్లో ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న జేసీబీ

నరసరావుపేట: పట్టణంలోని ఆక్రమణదారులు ఇప్పటికైనా తమ ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించి పురపాలకశాఖకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు కోరారు. లేనిపక్షంలో ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే పోలీసుశాఖ సహకారంతో పురపాలక అధికారులు, సిబ్బంది తొలగిస్తారని హెచ్చరించారు. మంగళవారం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను జేసీబీ సహాయంతో తొలగించారు. వీటిని టీపీవో సాంబయ్య పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఒక ప్రకటన విడుదల చేశారు. తాము రోడ్డు మార్జిన్, ఫుట్‌పాత్‌లు, డ్రైనేజీలపై ఉన్న ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని ఈనెల ఏడు, తొమ్మిది తేదీలలో ప్రకటనలు జారీ చేశామన్నారు. ఈనెల తొమ్మిది నుంచి ఆక్రమణల తొలగింపు ప్రారంభించామన్నారు. అయినప్పటికీ వ్యాపారులు తమ ఆక్రమణలను కొన్ని ఏరియాల్లో తొలగించలేదన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో భూమికి మేలు

నరసరావుపేట రూరల్: భూమి ఉత్పాదకతను పెంచే శక్తి ప్రకృతి వ్యవసాయనికి మాత్రమే ఉందని ప్రకృతి వ్యవసాయం డీపీఎం కె.అమలకుమారి తెలిపారు. అంజిరెడ్డి సమావేశ మందిరంలో వినుకొండ డివిజన్, బెల్లంకొండ మండలంలోని సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు రెండవ రోజుకు చేరాయి. ఐదురోజుల శిక్షణ కార్యక్రమంలో మంగళవారం ముఖ్యఅతిథిగా డీపీఎం అమలకుమారి మాట్లాడుతూ ప్రతి రైతు తొలకరి వర్షానికి ముందుగా ఆహార ధాన్యాలు, పప్పు ధాన్యాలు, నూనె గింజలు, సుగంధ ద్రవ్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, తీగజాతి, దుంపజాతి రకాలతో కూడిన 30 రకాల వివిధ జాతుల విత్తనాలు భూమిలో చల్లాలని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న ఇసుక లారీ

బస్సు డ్రైవరు సమయస్ఫూర్తితో తప్పిన ప్రమాదం

ఈపూరు(శావల్యాపురం): ఆర్టీసీ బస్సు-ఇసుక టిప్పర్ ఢీకొన్న సంఘటనలో పెను ప్రమాదం తప్పిన ఘటన మండలంలోని బోడిశంభునివారిపాలెం గ్రామ సమీపాన గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి మార్గంలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. వివరాలు మేరకు హిందుపురం నుంచి విజయవాడకు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న ఇసుక టిప్పర్ లారీను ఢీకొన్నాయి. ఈప్రమాదంలో ఆర్టీసీ బస్సులో 12 మంది ప్రయాణికులు ఉన్నారు. ఒకరికి స్వల్పగాయాలైనట్లు సహచర ప్రయాణికులు తెలిపారు. మరోక బస్సులో ప్రయాణికులను ఎక్కించి పంపించారు. ఇసుక టిప్పర్ అతివేగం ధాటికి ప్రమాదం జరిగినట్లు స్థానికులు వివరించారు. ఆర్టీసీ డ్రైవరు సమయస్ఫూర్తి వల్ల పెను ప్రమాదం తప్పినట్లు ప్రయాణికులు ఊపిరి పిల్చుకున్నారు. సంఘటన స్థలాన్ని ఈపూరు ఎస్సై యం.ఉమామహేశ్వరరావు, పోలీసు సిబ్బంది పరిశీలించారు.

నకరికల్లు-చీరాల వాడరేవు ఎలైన్‌మెంట్ మార్చండి



అమరావతిలో మంత్రి లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే చదలవాడ

నరసరావుపేట: నరసరావుపేట మీదుగా నకరికల్లు-చీరాల వాడరేవు వరకు నిర్మిస్తున్న 167ఎ నాలుగులైన్ల జాతీయ రహదారి ఎలైన్‌మెంట్ మార్పు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ రవిందబాబు రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం అమరావతిలో ప్రభావిత పొలాల రైతులు, పార్టీ నాయకులతో కలసి విన్నవించారు. ఈ రహదారిని అధికారులు 2022లో ప్రతిపాదించారని, ఇందులో అంతర్భాగంగా ఉన్న నరసరావుపేట బైపాస్ నిర్మాణానికి మూడు ఆప్షన్లు ఇచ్చారన్నారు. ఇందులో నరసరావుపేట దక్షిణం వైపు బైపాస్‌కు ప్రతిపాదించిన ఆప్షన్-3 వల్ల ఐదు గ్రామాల ప్రజలు, రైతులు పెద్దఎత్తున నష్టపోవాల్సి వస్తుందన్నారు. రైతులకు తక్కువ నష్టం కలిగించే ఆప్షన్-2ను అమలు చేయాలని లోకేష్‌కు సూచించారు.